జేఈఈ ఫలితాల్లో ఎస్సీ, ఎస్టీ గురుకులాల సత్తా

హైదరాబాద్, జూన్10 (నమస్తే తెలంగాణ): జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో ఎస్సీ, ఎస్టీ గురుకులాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ ఏడాది అడ్వాన్స్‌డ్ పరీక్షకోసం 400 మంది విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించారు. వీరిలో ఏకంగా 47మందికి పైగా విద్యార్థులు డైరెక్ట్ ర్యాంకులు సాధించగా, మరో 130 మంది విద్యార్థులు ప్రిపరేటరీ ర్యాంకులు సాధించడం విశేషం. అందులో 34మంది విద్యార్థులు 1000లోపు ర్యాంకులు సాధించడం గర్వకారణం. ఇందులో మహేశ్వరి–107, అభిషేక్–144, అంజలి –224, సూర్యకుమారి–226, అఖిల–233 ర్యాంకును సాధించారు. ఇక, చెంచు కమ్యూనిటీకి చెందిన శివశంకర్–1419 ర్యాంకు సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయా సొసైటీల సెక్రటరీలు సీతాలక్ష్మీ, డాక్టర్ శరత్‌లు ప్రత్యేకంగా అభినందించారు.

పీజీఈసెట్ పరీక్షలు ప్రారంభం

హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ) : పీజీఈసెట్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఎంఈ, ఎంటెక్, ఎంఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఈ పరీక్షలు మూడురోజుల పాటు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 5,729 మందికి 5,497 (96.22%) మంది విద్యార్థులు పరీక్ష రాశారు. మధ్యాహ్నం 4,398 మందికి, 3,900 (89.43%) మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్టు కన్వీనర్ డాక్టర్ ఏ అరుణకుమారి, కో–కన్వీనర్ రవీంద్రా రెడ్డి తెలిపారు.

ఆ పోస్టుల దరఖాస్తుల గడువు పెంపు

హైదరాబాద్, జూన్ 10(నమస్తే తెలంగాణ) : నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎఫ్‌డీసీ) మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ), డైరెక్టర్(ఫైనాన్స్) పోస్టుల భర్తీకి దరఖాస్తు గడువును ఈ నెల 14 వరకు పొడిగించారు. ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ ఉత్తర్వులు జారీచేసింది. సెర్చ్ కమ్ సెలెక్షన్ కమిటీ ద్వారా భర్తీ చేయనున్న ఈ పోస్టులకు గత మే 1న నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే.

ట్రాన్స్‌జెండర్ల పెట్రోల్ పంప్!

- సిరిసిల్లలో స్వయంసమృద్ధి వైపు
- పెట్రోల్‌పంప్ ఏర్పాటుకు 3 కోట్లు
- 25 మందికి ఉపాధి.. కలెక్టర్ జయంతి చొరవ
- ఆరు నెలల క్రితం ప్రణాళిక

సిరిసిల్ల సెకండ్ బైపాస్‌లో ట్రాన్స్‌జెండర్లతో కలిసి పెట్రోల్ పంప్ ఏర్పాటు చేయనున్న స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం

కలెక్టరేట్, జూన్ 10: ట్రాన్స్‌జెండర్ల స్వయంసమృద్ధి దిశగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో తొలి అడుగులు పడుతున్నాయి. కలెక్టర్ అనురాగ్ జయంతి ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్ల ఆర్థిక స్వావలంబన కోసం ప్రత్యేక కృషి జరుగుతున్నది. సిరిసిల్లలో ట్రాన్స్‌జెండర్ల ఉపాధి కోసం పెట్రోల్ పంప్ ఏర్పాటుకు రూ.3 కోట్లు మంజూరు చేయించారు. గత జనవరిలోనే దీని ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించారు. ఇండియన్ ఆయిల్ కంపెనీ ఆధ్వర్యంలో పంప్ ఏర్పాటుకు పట్టణ శివారులోని రెండో బైపాస్‌లో స్థలాన్ని ఎంపిక చేశారు. ప్రస్తుతం పనులు వేగంగా సాగుతున్నాయి. మరో మూడునెలల్లోనే పెట్రోల్ పంపు అందుబాటులోకి రానుండగా 15 మంది ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యక్షంగా, 10 మందికి పరోక్షంగా ఉపాధి లభించనున్నది.

వీ–హబ్ ఒప్పందంతో స్వయం ఉపాధి శిక్షణ

సమాన అవకాశాల చట్టం ప్రకారం రాజన్న సిరిసిల్ల జిల్లా జిల్లాలో ఉన్న ట్రాన్స్‌జెండర్ల సంక్షేమానికి జిల్లా అధికార యంత్రాంగం కృషి చేస్తున్నది. కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాల మేరకు జిల్లాలో ఇప్పటివరకు 25 మంది ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు జారీచేశారు. వారి స్వయంఉపాధి కోసం వివిధ రకాల శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసేందుకు వీ–హబ్‌తో ఒప్పందం చేసుకున్నారు. ఇందులో భాగంగానే సిరిసిల్లలో ట్రాన్స్‌జెండర్ల కోసం పెట్రోల్ పంప్ ఏర్పాటుకు కలెక్టర్ చొరవ చూపారు. ఆయన నోఅబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వడంతో ఇండియన్ ఆయిల్ కంపెనీ పెట్రోల్ పంప్‌ను మంజూరు చేసింది. జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పూజారి గౌతమి ఆధ్వర్యంలో జిల్లాలోని ట్రాన్స్‌జెండర్లకు ఇటీవలే అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పెట్రోల్ పంప్ నిర్వహణపై లబ్ధిదారులైన ట్రాన్స్‌జెండర్లకు త్వరలో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు జిల్లా సంక్షేమ అధికారి (నోడల్ ఆఫీసర్) లక్ష్మీ రాజం ప్రణాళిక రూపొందిస్తున్నారు.

శాశ్వతంగా పని దొరుకుతుంది

పెంట్రోల్ పంపు ద్వారా మాకు శాశ్వతంగా పని దొరుకుతుంది. ఉపాధి కోసం ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం ఉండదు. శాశ్వత పని కల్పించేందుకే కలెక్టర్ మాకు దారిచూపారు. పంప్ నిర్వహణపై ఇటీవలే సమావేశం నిర్వహించారు. ఈ పెట్రోల్ పంపు ద్వారా ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుంది. దీనిని సద్వినియోగం చేసుకుంటాం.

-బీ మధుషా, సిరిసిల్ల

మానవ మనుగడకు వ్యవసాయమే ఆధారం

- రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్
- వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆరో స్నాతకోత్సవం

వ్యవసాయ యూనివర్సిటీ, జూన్ 10: రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆరో స్నాతకోత్సవం సోమవారం విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన గవర్నర్, పీజేటీఎస్ ఏయూ కులపతి సీపీ రాధాకృష్ణన్ మాట్లాడుతూ మానవ మనుగడకు వ్యవసాయమే ప్రధాన ఆధారమని అన్నారు. వ్యవసాయానికి కీలకం విత్తనమని పీజేటీఎస్ ఏయూ మెరుగైన వంగడాలను రైతాంగానికి అందిస్తుండడం హర్షదాయకమని కొనియాడారు. ఎస్బీఐ మేనేజింగ్ డైరెక్టర్ చల్లా శ్రీనివాసులు శెట్టి మాట్లాడుతూ వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయరంగ అభివృద్ధికి అధునాతన టెక్నాలజీ దోహదం చేయాలని సూచించారు. వ్యవసాయంతో పాటు చేపల పెంపకం, నూనెగింజల ఉత్పత్తి, పౌల్ట్రీ రంగ అభివృద్ధితో దేశంలో ఇంద్రధనస్సు విప్లవం సాగుతుందని చెప్పారు. దేశ జనాభాలలో 46శాతం వ్యవసాయ అనుబంధ రంగాలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి, దేశ జీడీపీలో వ్యవసాయ రంగం వాటా దాదాపు 18 శాతమేనని ఆయన వివరించారు. దేశంలో వ్యవసాయ స్టార్టప్‌ల ప్రాధాన్యం పెరిగిందని యువత అగ్రిప్రెన్యూర్స్‌గా మారాలని ఆయన కోరారు. రాష్ట్ర వ్యవసాయ కార్యదర్శి, పీజేటీఎస్ఏయూ ఉపకులపతి ఎం రఘునందన్ రావు మాట్లాడుతూ ఆరేండ్లలో విశ్వవిద్యాలయం ప్రగతిని వివరించారు. ప్రతిభ కనబర్చిన 587 మంది విద్యార్థులకు అండర్ గ్రాడ్యుయేట్ పట్టాలు, 165 మందికి పీహెచ్‌డీ విద్యార్థుల్లో 12 బంగారు పతకాలను, 8 మంది యూజీ విద్యార్థులు 19 బంగారు పతకాలను సాధించారు. బుజ్జూరి దివ్య, వెలిచాల సాయి ప్రత్యూష చెరొక ఆరు బంగారు పతకాలను సాధించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ పీ రఘురామిరెడ్డి, వర్సిటీ అధికారులు, బోర్డు సభ్యులు, అకాడమిక్ కౌన్సిల్ సభ్యులు, విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతులు, అధికారులు, బోధనా బోధనేతర సిబ్బంది, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సదస్సులో ప్రసంగిస్తున్న గవర్నర్ సీపీ రాధాకృష్ణన్

- నగరంలో ట్రాఫిక్‌జామ్

హైదరాబాద్ నగరంలోని సచివాలయం సమీపంలో సోమవారం సాయంత్రం ట్రాఫిక్‌జామ్ కావడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కార్యాలయాల పనివేళలు ముగియడంతో అందరూ ఒకేసారి ప్రయాణం చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

మూగ యువతిపై లైంగిక వేధింపులు

చేర్యాల, జూన్ 10 : సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలోని ఓ గ్రామంలో మూగ యువతిపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆ యువతి తల్లిదండ్రులు వేర్వేరుగా ఉంటుండటంతో ఆమె అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటుంది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆమెపై కన్నేసి ఆదివారం రాత్రి లైంగికంగా వేధించాడు. విషయం బయటకు పొక్కడంతో పలువురు పెద్ద మనుషులు సోమవారం పంచాయితీ నిర్వహించి బాధితురాలికి రూ.90 వేలు ఇవ్వాలని నిందితుడిని ఆదేశించారు. ఇదే సమయంలో గ్రామానికి పోలీసులు వచ్చారనే విషయం తెలియడంతో పెద్ద మనుషులు అక్కడి నుంచి జారుకున్నారు. లైంగిక వేధింపులకు సంబంధించి బాధితురాలి బంధువులు, స్థానికులతో ఆరా తీశారు. అనంతరం బాధితురాలి బంధువులు ఫిర్యాదు మేరకు నిందితుడిపై లైంగిక వేధింపుల కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

రేవంత్ మీద బీజేపీ ఫిర్యాదుపై విచారణ చేయాలి

- మేజిస్ట్రేట్ కోర్టుకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 400 సీట్లు వస్తే రిజర్వేషన్లను రద్దు చేస్తుందని, రాజ్యాంగాన్ని మార్చేస్తుందని మే 4న కొత్తగూడెంలో జరిగిన ఎన్నికల సభలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ చేసిన ప్రైవేట్ ఫిర్యాదును చట్ట ప్రకారం విచారించాలని హైకోర్టు కింది కోర్టును ఆదేశించింది. బీజేపీ ఇచ్చిన ఫిర్యాదులోని అంశాల జోలికి వెళ్లకుండా విచారణను జూలైకి వాయిదా వేయడాన్ని తప్పుపట్టింది. ఫిర్యాదును పరిశీలించి చట్టప్రకారం తగిన ఉత్తర్వులు జారీ చేయాలని సూచించింది. సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా బీజేపీ చేసిన ప్రైవేటు ఫిర్యాదుపై విచారణ జరుపకుండా స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టు వాయిదా వేయడాన్ని సవాలు చేస్తూ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే వెంకటేశ్వర్లు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కే లక్ష్మణ్ సోమవారం విచారణ చేపట్టారు. చట్ట ప్రకారం విచారణ పూర్తి చేయకుండా కేసు వాయిదా వేసిన మేజిస్ట్రేట్ తీరును తప్పుపట్టారు. సత్వరమే చట్ట ప్రకారం విచారణ చేయాలని ఆదేశిస్తూ పిటిషన్‌పై విచారణ ముగిస్తున్నట్టు వెల్లడించారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై హైకోర్టు విచారణ

హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ మ్యానిఫెస్టోపై గెలుపొంది కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్, తెల్లం వెంకటరావుపై అనర్హత వేటు వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను హైకోర్టు విచారణకు స్వీకరించింది. కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేసేలా స్పీకర్‌కు ఉత్తర్వులివ్వాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు సోమవారం విచారణ జరిపింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన న్యాయస్థానం సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ ఇచ్చిన పిటిషన్లపై విచారణ ఏ దశలో ఉన్నదో తెలుపుతూ కౌంటర్లు దాఖలు చేయాలని స్పీకర్ కార్యాలయం, రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘాలను కూడా కోరింది. తదుపరి విచారణను జూలై 27వ తేదీకి వాయిదా వేశారు.

రేపు సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం

హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బుధవారం పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. సీఎంగా ఆయన నాలుగోసారి పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు ఆయన తన క్యాబినెట్ జాబితాను మంగళవారం గవర్నర్‌కు అందజేయనున్నారు. మంత్రిమండలి కూర్పుపై అంతటా ఆసక్తి నెలకొన్నది. టీడీపీతోపాటు కూటమిలోని జనసేన, బీజేపీకి ఇచ్చే మంత్రి పదవులపై ఉత్కంఠ నెలకొన్నది.

మహిళలపై బీజేపీ నేత లైంగిక వేధింపులు!

మొదటిపేజీ తరువాయి...

ఆరోపణలకు క్షమాపణ చెప్పడంతోపాటు అన్ని సామాజిక మాధ్యమాల నుంచి మూడు రోజుల్లో ఆ వ్యాఖ్యలను తొలగించాలని లేదా చట్టపరమైన అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొంటూ ఒక నోటీసు పంపింది. ముందుగా మాలవీయకు కలిగిన మానసిక క్షోభకు, గౌరవ భంగానికిగాను నష్టపరిహారం కింద రూ.10 కోట్లు డిమాండ్ చేసింది. బీజేపీ నేత రాహుల్ సిన్హాకు బంధువు అయిన శంతను సిన్హా ఇటీవల ఫేస్‌బుక్‌లో మాలవీయకు వ్యతిరేకంగా ఒక పోస్ట్ పెట్టారు. మాలవీయ పలువురు మహిళలపై లైంగిక దాడులకు పాల్పడ్డాడని, అనేక నీచమైన చర్యలలో భాగస్వామి అని ఆరోపించారు. ఈ ఆరోపణలపై కాంగ్రెస్ పార్టీ స్పందిస్తూ.. తక్షణం మాలవీయ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. మాలవీయ చేతిలో లైంగిక దోపిడీకి గురైన మహిళలకు బీజేపీ న్యాయం చేయాలని కాంగ్రెస్ నాయకురాలు సుప్రియా శ్రీనేథ్ డిమాండ్ చేశారు. ప్రధానిగా మోదీ ప్రమాణం చేసిన 24 గంటల్లోనే ఓ ప్రముఖ బీజేపీ నేతపై తీవ్రమైన ఆరోపణలు వచ్చాయని పేర్కొన్నారు. మాలవీయ చర్యలపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని అన్నారు.

వ్యాఖ్యలు ఉపసంహరించుకోను: సిన్హా

ఫేస్‌బుక్‌లో తాను చేసిన వ్యాఖ్యలు ఎవరినీ ఉద్దేశించినవి కావని శంతనుసిన్హా స్పష్టం చేశారు. కొందు బీజేపీ నేతలు తమ అధికార పదవులను కాపాడుకోవడం కోసం తమ ఢిల్లీ బాస్‌లను ప్రసన్నం చేసుకోవడానికి అనేక అక్రమ మార్గాలను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. ఫేస్‌బుక్‌లో తన పోస్ట్‌ను తప్పుగా అర్థం చేసుకున్నారని అన్నారు. తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని, సామాజిక మాధ్యమం నుంచి వాటిని తొలగించలేదని, ఒత్తిళ్లకు లొంగే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తనకు అందిన లీగల్ నోటీసుకు సమాధానం ఇచ్చేందుకు కొంత సమయం కావాలని కోరానని తెలిపారు.

నీట్ అక్రమాలపై విద్యార్థుల గర్జన

కేంద్ర విద్యా శాఖ ఆఫీస్ వద్ద విద్యార్థి సంఘాల ఆందోళన

- నీట్-2024ను రద్దు చేయాలని సుప్రీంకోర్టులో పిటిషన్
- నీట్ పరీక్షను తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలి
- తమిళనాడు ప్రభుత్వానికి హైకోర్టు రిటైర్డ్ జడ్జి కమిటీ సిఫార్సు

నీట్ అక్రమాలపై హైదరాబాద్‌లో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థుల ధర్నా

న్యూఢిల్లీ/చెన్నై, జూన్ 10: దేశవ్యాప్తంగా వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్ యూజీ–2024 ప్రవేశ పరీక్షలో అక్రమాలపై దర్యాప్తు జరుపాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు సోమవారం ఢిల్లీలోని కేంద్ర విద్యా శాఖ కార్యాలయం సమీపంలో ఆందోళన చేపట్టాయి. పరీక్ష నిర్వహణలో అక్రమాలు జరిగినట్టు వస్తున్న ఆరోపణలపై స్వతంత్ర, పారదర్శక విచారణ చేయాలని జేఎన్‌యూ విద్యార్థి సంఘం ఉపాధ్యక్షుడు అవిజిత్ ఘోష్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రవేశ పరీక్ష సమగ్రతను కాపాడేందుకు మరింత విశ్వసనీయమైన, సురక్షితమైన పరీక్షా విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దని, నీట్ అంశంపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల విడులైన నీట్–యూపీ పరీక్షా ఫలితాల్లో ఏకంగా 67 మందికి మొదటి ర్యాంకు రావడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే. అయితే పరీక్ష నిర్వహణలో ఎలాంటి అవకతవకలు జరుగలేదని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) చెబుతున్నది.

కౌన్సెలింగ్‌పై స్టే విధించాలి

నీట్ యూజీ–2024 ప్రవేశపరీక్షను రద్దు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. అదేవిధంగా మే 5న నిర్వహించిన ఈ పరీక్షలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు జరిపేందుకు సిట్ ఏర్పాటు చేయాలని, పేపర్ లీక్ ఆరోపణలపై దర్యాప్తు పూర్తయ్యే వరకు కౌన్సెలింగ్‌పై స్టే విధించాలని పిటిషన్‌దారులు అభ్యర్థించారు. పరీక్ష నిర్వహణ హేతుబద్ధంగా లేదని, విద్యార్థులకు బ్యాక్‌డోర్ ద్వారా ప్రవేశాలు కల్పించేలా అక్రమాలు జరిగాయని ఆరోపించారు.

ప్లస్ 2 మార్కులే ప్రామాణికంగా ఉండాలి

నీట్ ప్రవేశపరీక్షను తొలగించేందుకు చట్ట, శాసనపరమైన చర్యలు తీసుకోవాలని మద్రాస్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏకే రాజన్ నేతృత్వంలోని కమిటీ తమిళనాడు ప్రభుత్వానికి సిఫారసు చేసింది. వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు హయ్యర్ సెకండరీ ఎగ్జామినేషన్(ప్లస్ 2) తరగతిలో వచ్చిన మార్కులను ప్రామాణికంగా తీసుకోవాలని సూచించింది. వివిధ పరీక్ష బోర్డుల విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నది. తమిళనాడు విద్యార్థులపై నీట్ ప్రభావంపై అధ్యయనానికి ఈ కమిటీని డీఎంకే ప్రభుత్వం 2021లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పాటు చేసింది.

నకిలీ ప్రకటనలను నమ్మొద్దు

సిలబస్‌పై సీబీఎస్ఈ హెచ్చరిక

న్యూఢిల్లీ: సీబీఎస్ఈ సిలబస్, నమూనా ప్రశ్నాపత్రాలు తదితర అంశాల్లో తప్పు దోవ పట్టించే ప్రకటనల పట్ల జాగ్రత్తగా ఉండాలని సీబీఎస్ఈ సోమవారం విద్యార్థులను హెచ్చరించింది. వార్తలను సరి చూసుకోకుండా ప్రచురించే ఆన్‌లైన్ పోర్టళ్లను నమ్మొద్దని సూచించింది. 'మా సిలబస్, నమూనా ప్రశ్నాపత్రాల గురించి కొన్ని పోర్టళ్లు, వెబ్‌సైట్లు కాలం చెల్లిన లింకులను, ధ్రువీకరించుకోని వార్తలను ప్రచురిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. 2024–25 విద్యా సంవత్సరానికి గాను తాజా సమాచారం అందిస్తున్నట్టు అవి తప్పుడు ప్రకటనలు ఇస్తున్నాయి' అని సీబీఎస్ఈ పేర్కొంది. వాటిని నమ్మి గందరగోళానికి గురి కావొద్దని సూచించింది.

మహా రైతుల కన్నెర్ర

- కరువు రాయితీల కోసం నేషనల్ హైవే బిగ్బంధం
- ప్రభుత్వ జాప్యంపై అన్నదాతల ఆగ్రహం

లాతూర్, జూన్ 10: కరువు రాయితీలు, ఇతర ఉపశమన ఆర్థిక ప్రయోజనాలు అందించడంలో జాప్యాన్ని నిరసిస్తూ వందలాది మహారాష్ట్ర రైతులు సోమవారం లాతూర్–అంబేజోగయి హైవేను దిగ్బంధించారు. రెనాపూర్ తహశీల్‌ను ప్రభుత్వం కరువు ప్రాంతంగా ప్రకటించినప్పటికీ రైతులకు ఇంకా కరువు రాయితీలు అందలేదని ధర్నాకు నాయకత్వం వహించిన షేత్కరీ సంఘటన నాయకుడు గజన్ బొలంగే తెలిపారు. రహదారి దిగ్బంధం రెండు గంటల పాటు సాగింది. ఈ సందర్భంగా వారు తహశీల్ కార్యాలయ గేటును మూసివేసి నిరసన తెలిపారు. '70 శాతానికి పైగా అర్హులైన రైతులకు కరువు రాయితీలు లేదా ఇతర ఉపశమన ప్రయోజనాలు అందలేదు. దీనిపై తహసీల్దార్ వివరణ ఇవ్వాలి. ఇంకా రైతుల ఖాతాల్లోకి డబ్బులు ఎందుకు వేయలేదో అధికారులు బ్యాంకులను అడగాలి' అని గజన్ అన్నారు. ఒక హెక్టార్‌కు రూ.50 వేల పంట బీమా రాయితీని కూడా రైతులు కోరుకుంటున్నారని ఆయన తెలిపారు. ఈ నెల 20లోగా కరువు రాయితీలు అందించకుంటే రెనాపూర్ ప్రాంతంలో మరింత పెద్ద ధర్నా నిర్వహిస్తామని రైతు నాయకుడు దత్తాజీ షిండ్గే హెచ్చరించారు.

మణిపూర్ సీఎం సెక్యూరిటీ కాన్వాయ్‌పై దాడి

భద్రతా సిబ్బందిలో ఒకరికి గాయాలు

ఉగ్ర దాడిలో గాయపడిన భద్రతా సిబ్బందిని పరామర్శిస్తున్న బీరేన్ సింగ్

ఇంఫాల్ : మణిపూర్ సీఎం బీరేన్ సింగ్ సెక్యూరిటీ కాన్వాయ్‌పై మిలిటెంట్లు కాల్పులకు తెగబడ్డారు. కాంగ్‌పోక్పి జిల్లాలో సోమవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. మిలిటెంట్ల దాడిలో కాన్వాయ్‌లోని ఓ వాహనం డ్రైవర్ కుడి భుజానికి బుల్లెట్ గాయమైంది. ఇటీవల హింస చెలరేగిన జిర్‌బామ్ జిల్లాలో సీఎం మంగళవారం పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ముందస్తు భద్రతా ఏర్పాట్లలో భాగంగా కాన్వాయ్ వెళ్తుండగా కొట్లెన్ గ్రామానికి సమీపంలో మిలిటెంట్లు దాడికి దిగారు. కాన్వాయ్‌లోని వాహనాలపై పలుమార్లు కాల్పులు జరిపారని, భద్రతా బలగాలు మిలిటెంట్ల కోసం కూంబింగ్ ఆపరేషన్ చేపట్టినట్టు చెప్పారు.

ఏడాది దాటినా మణిపూర్‌లో శాంతి ఏదీ?

ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్

నాగపూర్‌లో ప్రసంగిస్తున్న భాగవత్

నాగపూర్, జూన్ 10: మణిపూర్ హింసపై ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ కీలక వ్యాఖ్యలు చేశారు. హింస చెలరేగి ఏడాది దాటుతున్నా.. ఆ రాష్ట్రంలో శాంతియుత పరిస్థితులు నెలకొనటం లేదంటూ పాలకుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం నాగపూర్‌లో ఆరెస్సెస్ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. మణిపూర్ హింసను అత్యంత ప్రాధాన్యత గల అంశంగా పరిగణించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మోహన్ భగవత్ సూచించారు. శాంతి కోసం ఏడాది కాలంగా ఎదురుచూస్తున్నా.. పరిస్థితులు మారటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మాటల చాతుర్యంతో ఎన్నికల్లో గెలుపొందటంపై కాకుండా, దేశం ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించాలని పాలకుల తీరును విమర్శించారు.

ఫ్రాన్స్ పార్లమెంటు రద్దు

పారిస్: ఫ్రాన్స్ పార్లమెంటు దిగువ సభ నేషనల్ అసెంబ్లీని ఆ దేశాధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రన్ రద్దు చేశారు. యూరోపియన్ యూనియన్ ఎన్నికల్లో ఆయన పార్టీ నేషనల్ రిన యసెన్స్‌కు షాక్ తగలడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. జూన్ 30, జూలై 7 తేదీల్లో నేషనల్ అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతాయని ప్రకటించారు. యూరోపియన్ యూనియన్ ఎన్నికల్లో ఫ్రాన్స్ ప్రతిపక్షంలోని అతివాద నేషనల్ ర్యాలీ పార్టీ అత్యధిక స్థానాల్లో విజయం సాధించబోతున్నట్లు ఆదివారం వెల్లడైంది. వలసదారులను కట్టడి చేయాలని డిమాండ్ చేస్తున్న ఈ ప్రతిపక్ష పార్టీకి మద్దతు 31–32 శాతం వరకు పెరిగినట్లు సర్వేలు చెప్పున్నాయి. మాక్రన్ పార్టీకి దాదాపు 15 శాతం మద్దతు లభిస్తున్నట్లు తెలిసింది. అయితే ఈయూ ఎన్నికల్లో మాక్రన్ పోటీ చేయలేదు. ఆయన పదవీ కాలం మరో మూడేళ్లు ఉంది. నేషనల్ అసెంబ్లీ ఎన్నికల్లో అధిక స్థానాలను గెల్చుకుంటే, సొంతంగా నిర్ణయాలు తీసుకోవడానికి, బిల్లుల ఆమోదానికి మాక్రన్‌కు అవకాశం లభిస్తుంది.

సత్నామీల నిరసన హింసాత్మకం

ఎస్పీ ఆఫీసు నుంచి వెలువడుతున్న పొగ

బలోడా బజార్: సత్నామీ తెగవారు అత్యంత పవిత్రంగా పరిగణించే జైత్‌ఖామ్బ్ (స్థూపం)ను గుర్తు తెలియని వ్యక్తులు అపవిత్రం చేయడంతో నిరసనలు పెల్లుబికాయి. ఛత్తీస్‌గఢ్ గిరౌడ్‌పురి ధామ్‌లోని అమర్ గుహలో ఉన్న ఈ పవిత్ర చిహ్నాన్ని గత నెల 15–16 మధ్య రాత్రి అపవిత్రం చేశారు. ఈ కేసులో పోలీసులు ముగ్గుర్ని అరెస్ట్ చేశారు. అయితే ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేస్తూ, కలెక్టర్ కార్యాలయం వద్ద ఘెరావ్ నిర్వహించాలని సత్నామీ తెగవారు పిలుపునిచ్చారు. బలోడా బజార్ పోలీసు సూపరింటెండెంట్ సదానంద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, దాదాపు 5,000 మంది నిరసనకారులు తరలివచ్చి, కలెక్టర్ కార్యాలయంలోకి దూసుకెళ్లారు. రాళ్లు విసురుతూ, కొన్ని వాహనాలను తగులబెట్టారు. ఎస్పీ కార్యాలయానికి నిప్పు పెట్టారు. ఈ కార్యాలయంలో కొంత భాగం దెబ్బతింది. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పి, పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

కెనడాలో భారతీయుడి హత్య

ఒట్టావా: విదేశాల్లో భారతీయులు, భారత సంతతి పౌరులపై దాడులకు అడ్డు కట్ట పడట